క్లుప్తంగా

మిరపలో పంటకోత పరీక్ష


పంటకోత ప్రయోగం నిర్వహిస్తున్న అధికారులు

కోవెలకుంట్ల: మండలంలోని సౌదరదిన్నె, చిన్నకొప్పెర్ల గ్రామాల్లో మిరప పంటలో ఉద్యాన వన శాఖ ఆధ్వర్యంలో బుధవారం పంట కోత పరీక్ష నిర్వహించారు. స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని ఆయా మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులు విస్తారంగా మిరప సాగు చేశారు. ఉద్యానవన శాఖ అధికారిణి ధరణి, ఏఎస్‌ఓ ఈశ్వరయ్య, క్షేత్రస్థాయిలో పంటకోత పరీక్ష చేపట్టారు. కార్యక్రమంలో ఆర్‌బీకే సిబ్బంది శశిరేఖ, ధరణి, రైతులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల తనిఖీ

కోవెలకుంట్ల: మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ మద్యం దుకాణాలను జిల్లా ఎక్సైజ్ అధికారి రవికుమార్‌రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. కలుగొట్లతోపాటు పట్టణంలోని నాలుగు మద్యం దుకాణాలను పరిశీలించారు. స్టాక్ రికార్డులు, సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్ హాజరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల కనుగుణంగా విక్రయాలు జరపాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మద్యం బాటిళ్లు విక్రయించాలని, బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తే శాఖపరమైనచర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ శాఖ ఎస్‌ఐ జగదీష్, కానిస్టేబుల్ కృష్ణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం సహాయ కార్యదర్శిగా నారాయణ



బనగానపల్లి: మండలంలోని నందివర్గం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యుడు, గ్రామ పద్మశాలి సంఘం అధ్యక్షుడు మెటికెల నారాయణ రాయలసీమ ప్రాంతీయ పద్మశాలి సంఘం సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. కర్నూలులోని రాయలసీమ ప్రాంతీయ పద్మశాలి సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో రాయలసీమ ప్రాంతీయ పద్మశాలి సంఘం అధ్యక్షుడు కొంకతి లక్ష్మినారాయణ, ఉపాధ్యక్షుడు పుత్తా రామక్రిష్ణతో పాటు కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా తనను ఎన్నుకున్నారని నారాయణ తెలిపారు.

ఆర్బీకే సేవలను సద్వినియోగం చేసుకోండి

అవుకు: రైతుభరోసా కేంద్రాల్లో అందుతున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ప్రసాద్ రావు సూచించారు. బుధవారం అవుకు-2, అన్నవరం గ్రామాల్లోని ఆర్బీకేలను సందర్శించారు. ఆర్బీకేలలో ప్రదర్శించిన పంట నమోదు జాబితా వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబితాలో రైతులు సాగు చేసిన పంటల వివరాలను సరిచూసుకుని ఏవైనా అభ్యంతరాలు ఉంటే వ్యవసాయ సహాయకులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు ప్రవీణ్‌కుమార్, సింధియా తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకుల సమస్యల పరిష్కారానికి కృషి


బోయ ఎర్రన్న సన్మానిస్తున్న సభ్యులు

అవుకు: వాల్మీకుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన సంఘం అధ్యక్షుడు బోయ ఎర్రన్న అన్నారు. బుధవారం స్థానిక చెన్నకేశవస్వామి ఆలయంలో వాల్మీకి సభ్యులు నూతన సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బోయ ఎర్రన్న అధ్యక్షుడిగా, మీనిగే శ్రీరాముడు ఉపాధ్యక్షుడిగా, సభ్యులుగా చిన్న వుశేనయ్య, బోయ రాజు, మీనిగే హుస్సేన్, మీనిగే మహేష్, ఎర్రమల గోపాల్‌ను ఎన్నుకున్నారు. అనంతరం సభ్యులు నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను సన్మానించారు.

సదరం క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

డోన్ : సదరం క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలి దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని క్యాంపు నిర్వాహకులు, ఆర్థోపెడిక్ డాక్టర్ సయ్యద్ గౌస్, అహమ్మద్ పీర్ తెలిపారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో బుధవారం నిర్వహించిన సదరన్ క్యాంప్‌లో వారు పాల్గొన్నారు. అర్హత సర్టిఫికెట్లు పొంది ప్రభుత్వ రాయితీలు పొందాలని వారు దివ్యాంగులకు సూచించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

అవుకు: వీఓఏలను తొలగించే కాలపరిమితి సర్క్యులర్‌ను ప్రభుత్వం రద్దు చేయాలని కోరుతూ వైకేపీ ఏపీఎం విజయగోపాల్‌కు బుధవారం సీఐటీయూ నాయకులు వినతి పత్రాన్ని అందించారు. అనంతరం సీఐటీయూ మండల అధ్యక్షుడు అల్లిపీరా ఆధ్వర్యంలో వెలుగు కార్యాలయ ఆవరణలో వీఓఏలు ధర్నా చేశారు. వెలుగు కార్యాలయాల్లో వీఓఏలుగా విధులు నిర్వహిస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని అల్లిపీరా కోరారు. కార్యక్రమంలో వీఓఏలు శ్రీనివాసరెడ్డి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

రాసులుగా 'పసుపు' ఆశలు!

- మొదలైన పసుపు దిగుబడులు
- పంటపై దుంప తెగులు ప్రభావం
- ఆశించిన ధర లేక రైతన్న ఎదురు చూపులు


ఆరబోసిన పసుసు కొమ్ములు

కొలిమిగుండ్ల: సిరులు కురుపించే పసుపు దిగుబడులు మొదలయ్యాయి. రైతులు పసుపు దుంప తవ్వకాల పనుల్లో నిమగ్నమయ్యారు. వాణిజ్య పంటల్లో ప్రధానమైన పసుపును బనగానపల్లె నియోజవర్గంలో దాదాపు 320 సాగైనట్లు అధికారుల అంచనా. పసుపు సాగులో కొలిమిగుండ్ల మండలం తిమ్మనాయునిపేటకు ప్రత్యేక గుర్తింపు ఉంది. పూర్వం నుంచి ఈ గ్రామంలో పసుపును అత్యధికంగా సాగు చేస్తారు. పెట్టుబడులు ఎక్కువైనా రైతులు ఇష్టంగా సాగు చేస్తారు. సారవంతమైన భూమలు కావడంతో దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయి. ధర అనుకూలిస్తే సిరులు కురిసినట్లే. ఈ పంట ఎంతోమంది రైతులను కష్టాల నుంచి గట్టెక్కించింది కూడా. గతంలో అత్యధికంగా 120 ఎకరాలకు పైగానే పండించేవాళ్లు. కాలక్రమేనా పెట్టుబడులు అధికం కావడంతో రైతులు ఇతర వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ ఏడు గ్రామంలో 70 ఎకరాల్లో పసుపు పండించారు. తొమ్మిది నెలల పంట కాలం పూర్తి కావడంతో దుంపలు తవ్వి యంత్రాల సాయంతో ఉడకబెట్టే పనుల్లో పసుపు రైతులు బిజీ అయ్యారు. కొందరు ఇప్పటికే రాసులుగా పోసి మద్దతు ధర కోసం ఎదురు చూస్తున్నారు.

తగ్గిన దిగుబడులు

పచ్చబంగారానికి ఆశించిన మద్దతు ధర లభిస్తే సాగు పసిడిమయం అవుతుందని రైతులు ఎదురు చూస్తున్నారు. ఈసారి పసుపు పంటకు దుంప తెగులు ఆశించడంతో దిగుబడులపైనా తీవ్ర ప్రభావం చూపిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే ఎకరాకు 40 క్వింటాళ్ల మేర దిగుబడులు ఉంటాయి. అయితే ఈయేడు దుంప తెగులు


పసుపు దుంపలను ఉడికిస్తున్న దృశ్యం

పసుపుపైరును ఆశించింది. దీంతో దిగుబడులు పూర్తిగా తగ్గాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఇరవై క్వింటాళ్ల లోపు మాత్రమే దిగుబడులు రావడంతో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయి. పైగా మార్కెట్‌లో ధర ఆశించినంత లేదు. క్వింటాం పసుపు ధర రూ.4200 నుంచి రూ5వేలు లోపు నడుస్తుంది. గిట్టుబాటు ధర కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.

ఆశించిన ధర వస్తేనే లాభం



పసుపు పంటకు ఈ సారి దుంప తెగులు సోకడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. పైగా ధర తక్కువగా ఉంది. ఆశించిన ధరక వస్తే నష్టాల నుంచి గట్టెక్కుతాం. అర ఎకరా విస్తీర్ణంలో పసుపు పండించా. ఇప్పుడున్న రేటు ప్రకారం అమ్ముకుంటే పెట్టుబడికి సరిపోతుంది.

– హుశేన్‌వలి, రైతు, తిమ్మనాయునిపేట

మద్దతు ధర కల్పించాలి



పసుసు పంటకు ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తే రైతులకు ఊరట కలుగుతుంది. పసుపు సాగుకు పెట్టుబడులు అధికంగా అయ్యాయి. గ్రామంలో పెద్దల కాలం నుంచి పసుపు ఎక్కువగా పండిస్తున్నాం. ఇప్పుడు ధర రూ.5వేలు నడుస్తుంది. ఈ ధర ప్రకారం రైతుకు గిట్టుబాటు ఏ మాత్రం ఉండదు.

– రహీం, రైతు, తిమ్మనాయునిపేట

డ్రోన్ పైలెట్ ట్రైనింగ్‌కు దరఖాస్తు చేసుకోండి

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల్లో పీఏ స్కిల్ డెవలెప్ మెంట్ ఆధ్వర్యంలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో కొనసాగుతున్న డ్రోన్ పైలెట్ ట్రైనింగ్‌కు మండలంలోని నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవాలని ట్రైనర్లు దస్తగిరి, సుల్తాన్ బుధవారం తెలిపారు. మండలంలో ఇప్పటి వరకు 32 మంది శిక్షణ పూర్తి చేసుకొని పలు కంపెనీలలో ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. నాల్గవ బ్యాచ్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు.

ఆధార్ అనుసంధానం చేయాలి

కొలిమిగుండ్ల: ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం చేసే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎంపీడీఓ సుబ్బరాజుతో కలిసి వివిధ గ్రామాల బూత్‌లెవల్(బీఎల్‌ఓలు) ఆఫీసర్లు, వీఆర్వోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి బీఎల్‌ఓ తప్పక 95 శాతం పూర్తి చేయాలని, లేని పక్షంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఓటర్ల జాబితా ఆధారంగా వారి ఇంటి వద్దకు వెళ్లి ఓటర్‌తో పూర్తిగా చర్చించాక ఆధార్‌తో అనుసంధానం చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రఫీ, సీనియర్ అసిస్టెంట్ నాగరాజు,ఆర్‌ఐ రాముడు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

- డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ రామచంద్రారెడ్డి


మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

బనగానపల్లెరూరల్: ఉపాధి పనులకు వచ్చే రోజువారీ కూలీల సంఖ్యను మరింత పెంచాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ రామచంద్రారెడ్డి సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శివరామయ్య అధ్యక్షతన మండలంలో జరుగుతున్న ఉపాధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ మండలంలో వ్యవసాయ పనులు పూర్తి అయ్యాయని, కూలీలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా సొంత గ్రామాల్లో ఉన్న ఉపాధిపనులు సద్వినియోగం చేసుకునేలా టీఏ, ఎఫ్ఏలు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 70 శాతం టార్గెట్ పూర్తి చేయడం జరిగిందని, మిగిలిన 30శాతం మార్చి చివరిలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే టీఏ, ఎఫ్ఏలపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న వేతనాలు వారంలోపు లబ్ధిదారుల ఖాతాల జమ అవుతాయన్నారు. కార్యక్రమంలో డోన్ క్లస్టర్ ఏపీడీ శ్రీవిద్య, ఏపీఓ హరికృష్ణ, ఈసీ హరికిశోర్, టీఏలు చాంద్‌బాషా, షబ్బీర్, శ్వేత, హుస్సేన్ బాషా, రంగస్వామి, భూపాల్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ

బేతంచెర్ల: మండల పరిధిలోని ముసలాయిచెర్వు గ్రామంలోని చెర్వులో జరుగుతున్న పూడిక తీత పనులను నంద్యాల జిల్లా డ్వామా పీడీ రామచంద్రారెడ్డి, ఏపీడీ శ్రీ విద్య బుధవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జాబుకార్డు కల్గిన ప్రతి ఒక్క కుటుంబం 100 రోజులు పూర్తి చేసుకోవాలన్నారు. సమయపాలన పాటించి ఉదయం 6గంటలకు పనికి హాజరై సగటు వేతనం రూ.257 పొందాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ శేషన్న, సర్పంచ్ తిమ్మయ్య, పంచాయతీ కార్యదర్శి సామె నాయక్ పాల్గొన్నారు.

క్షయవ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి


మీరాపురం గ్రామస్తులతో మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు

బనగానపల్లెరూరల్: క్షయవ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకరుడు సూచించారు. బుధవారం ఆరోగ్య మేళలో భాగంగా మండలంలోని మీరాపురంలో సిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు. ప్రజలకు క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివశంకరుడు మాట్లాడుతూ ఈ వ్యాధి కలిగిన వారిలో జ్వరం, ఆకలి మందగించడం, బరువుతగ్గిపోవడం, రాత్రి సమయంలో చమటలు పట్టడం తదితర లక్షణాలు కనిపిస్తాయన్నారు. వీరు వెంట నే ఆరోగ్య కేంద్రాల్లోని వైద్యులను సంప్రదించాలని సూచించారు. క్షయవాధిగ్రస్తులకు ప్రభుత్వమే ఉచితంగా మందులు అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ నాగకుమారి, ఏఎన్ఎం విజయలక్ష్మీ, సూపర్ వైజర్ నరసింహ, పంచాయతీ కార్యదర్శి ప్రకాశం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అవుకు: మండల కేంద్రం అవుకు, రామాపురం గ్రామంలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి క్షయ వ్యాధి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. రెండు వారాలకు మించి దగ్గు, గళ్ల, జ్వరం, బరువు తగ్గడం, ఆకలి తగ్గడం, ఉమ్మిలో రక్తం పడటంలాంటి లక్షణాలు ఉంటే వెంటనే డాక్టర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓలు ఫర్హాన, హాజీవలి, సల్మాన్ ఏఎన్ఎంలు దానమ్మ, వెంకటేశ్వరమ్మ, ఎస్ వెంకటేశ్వరమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రెండేళ్లలో అద్భుత ప్రగతి

డోన్ : డోన్ పురపాలక సంఘానికి పాలకవర్గం ఏర్పడి రెండేళ్లలో అద్భుతంగా ప్రగతి సాధించామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సహకారంతో పట్టణ ప్రజలకు మౌలిక వసతులు కల్పించామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు మోడల్ నియోజకవర్గంగా డోన్‌ను తీర్చిదిద్దే క్రమంలో అనేక శాశ్వతమైన పనులు చేపట్టడం జరిగిందన్నారు. పట్టణంలో రూ.30 కోట్లతో వంద పడకల ఆసుపత్రి, రూ.8కోట్లతో ఆధునిక కూరగాయల మార్కెట్, ఎస్సీ, బీసీ బాలికల, బాలుర వసతిగృహాల నిర్మాణానికి రూ.20కోట్లు, నర్సింగ్ కళాశాల నిర్మాణానికి మరో రూ.10 కోట్లు మంజూరయ్యాయన్నారు. పట్టణం గుండా వెళ్తున్న 44వ జాతీయ రహదారిని దాటేప్పుడు జరుగుతున్న ప్రమాదాలు దృష్టిలో ఉంచుకొని మంత్రి బుగ్గన చొరువతో రూ.60కోట్లతో రెండు అండర్‌పాస్ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టారన్నారు. పట్టణ ప్రజలు ఆహ్లాదంగా గడిపేందుకు రూ.8కోట్లతో నగర వనం, మరో రూ.10కోట్లతో 8 పార్కుల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. మునిసిపల్ పరిపాలన భవనాన్ని రూ.7.60కోట్లతో నూతనంగా నిర్మించడం జరిగిందని వివరించారు.

నేడు ఆటల పోటీలు

పాలకవర్గం పదవీకాలం రెండేళ్లు పూర్తయిన సందర్భంగా 32 మంది కౌన్సిలర్లకు గురువారం పలు ఆటల పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. స్థానిక నెహ్రూ పార్కు నందు నిర్వహించే ఈ పోటీల్లో స్థానికులందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం


పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థినులు


ప్రభుత్వజూనియర్ కళాశాలలో పరీక్ష రాసేందుకు హాజరైన విద్యార్థులు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల పట్టణంలోని రెండు పరీక్షా కేంద్రాల్లో బుధవారం నుంచి ఇంటర్మీడియేట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రథమ సంవత్సర పరీక్షకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో 194 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా ఐదుగురు, పట్టణ శివారులోని గురుకుల కళాశాలలో 181 మంది విద్యార్థులకు ఐదుగురు గైర్హాజర్ అయినట్లు ఆయా పరీక్షా కేంద్రాల చీఫ్ సూపర్‌వైజర్లు మద్దిలేటి స్వామి, పిర్దౌస్ అంజుమ్ తెలిపారు. ఆ కేంద్రాలకు డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లుగా నంద్యాల, కొలిమిగుండ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకులు రామలింగారెడ్డి, శంకర్‌రెడ్డిని నియమించారు.

కొలిమిగుండ్ల: కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. కొలిమిగుండ్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రానికి ఎగ్జామ్ చీఫ్‌గా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా బనగానపల్లె జూనియర్ కళాశాల అధ్యాపకుడు రామయ్యను నియమించారు. జూనియర్ కాలేజీతో పాటు మోడల్ స్కూల్, కస్తూర్బా విద్యార్థులు 109 మంది పరీక్షకు హాజరయ్యారు.

ప్రశాంతంగా మొదటి సంవత్సరం ఇంటర్ పరీక్షలు

బనగానపల్లెరూరల్: పట్టణంలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎస్‌వీ డిగ్రీ అండ్ జూనియర్ కళాశాల, కేజీఆర్ జూనియర్ కళాశాలల్లో మొత్తం 620 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 17 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్ ఆఫీసర్స్ భీముడు నాయక్, రమేష్, రామకృష్ణ తెలిపారు. మొదటి రోజు లాగ్వేజ్ పరీక్ష ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు జరిగింది. పరీక్ష కేంద్రాల డిపార్ట్‌మెంట్ ఆఫీసర్స్‌గా విశ్వనాథ్, జకరయ్య, జ్యోతి వ్యవహరించారు.

డోన్ టౌన్ : ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. డోన్ పట్టణంలో మొత్తం నాలుగు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. మొదటి రోజు జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షను హైపవర్ కమిటీ సభ్యుడు సోమశేఖరప్ప, ఆర్డీఓ వెంకటరెడ్డి, డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తనిఖీలు చేశారు. పరీక్షలకు మొత్తం 1056 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 263 మందికి గాను ఇద్దరు, మోడల్ స్కూల్‌లో 267మందికి గాను 8మంది, శ్రీసుధ జూనియర్ కళాశాలలో 261మందికి గాను 10మంది, వేంకటేశ్వర కళాశాలలో 265మందికి గాను 9మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

బేతంచెర్ల: మండల పరిధిలోని గోరుమానుకొండ మోడల్ స్కూల్‌లో జరుగుతున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షలను డిప్యూటీ తహసీల్దార్ సత్యదీప్, సీఐ ప్రియతం రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థుల హాజరు, పరీక్షలను తీరును పరిశీలించారు. అదేవిధంగా పాణ్యం సిమెంట్ జూనియర్ కళాశాలలో జరుగుతున్న పరీక్షలను పరిశీలించారు. మోడల్ స్కూల్‌లో 234 మందికిగాను 220 మంది, పాణ్యం సిమెంట్ జూనియర్ కళాశాల్లో 197 మందికి గాను 180 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు పరీక్షల అధికారులు తెలిపారు.


పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎస్పీ

ప్యాపిలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు జరిగిన ప్రథమ సంవత్సరం తెలుగు పరీక్షకు 125 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 118 మంది హాజరయ్యారు. ఏడుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం తెలిపారు.

వంద రోజులు పని కల్పించాలి

కొలిమిగుండ్ల: ఉపాధి కూలీలందరికీ ఈనెలాఖరులోగా వంద రోజుల పని దినాలు కల్పించాలని ఏపీడీ సాంబశివరావు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్‌తో కలిసి ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. మార్చి 341 నాటికి వంద శాతం లేబర్ బడ్జెట్ పూర్తి చేసేందుకు ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. హౌసింగ్, ప్లాంటేషన్, చెరువుల్లో అమృత్ సరోవర్ కింద కూలీలతో పనులు చేయించాలన్నారు. వైఎస్సార్ జలకళ పథకం కింద బోర్లు వేయించుకున్న రైతులకు ఫారం పాండ్స్‌పై అవగాహన కల్పించి పండ్ల తోటలు సాగు చేసేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఓ గంగన్న, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

బేతంచెర్ల: పట్టణంలోని రెండవ సచివాలయం పరిధిలో ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు బుధవారం ఇంటింటికీ వెళ్లి ఫివర్ సర్వే చేశారు. వైద్య పరీక్షలు నిర్వహించిన ఏఎన్ఎం మునేశ్వరి క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా వ్యక్తిగత, పరిసరాల శుభ్రత ప్రాముఖ్యతను వివరించారు.

శివవరం మీదుగా కోవెలకుంట్లకు ఆర్టీసీ బస్సు

అవుకు: కరోనా మహమ్మారి నేపథ్యంలో మూడేళ్ల కిందట మండల పరిధిలోని శివవరం రూటుకు ఆర్టీసీ బస్సు రద్దయ్యింది. ఈ రహదారి గుండా అవుకు నుంచి చెన్నంపల్లె , శివవరం, వసంతాపురం, బొందలదిన్నే, కమలపురి, ముదిగేడు మీదుగా కోవెలకుంట్లకు వెళ్లొచ్చు. అయితే బస్సు తిరగకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు పలుమార్లు ఆర్టీసీ అధికారులకు విన్నవించిన ఫలితం లేకపోయింది. అయితే వారం క్రితం ఆయా గ్రామాల ప్రజలు దివంగత ఎమ్మెల్సీ చల్లా భగీరథ్ రెడ్డి సతీమణి, అవుకు జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మీకి సమస్యను విన్నవించారు. స్పందించిన ఆమె ఆర్టీసీ రీజనల్ మేనేజర్‌కు సమస్యను వివరించారు. ఈ మేరకు బుధవారం అవుకు నుంచి శివవరం, వసంతాపురంల మీదుగా కోవెలకుంట్లకు బస్సు ఏర్పాటు చేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు చల్లా శ్రీలక్ష్మీకి కృతజ్ఞతలు తెలిపారు.

వంక, మాన్యం భూమి ఆక్రమణ

ప్యాపిలి: మండల పరిధిలోని చంద్రపల్లి గ్రామ శివారులోని పెద్దపాయి కొట్టాల మార్గంలో దేవుని మాన్యంతో పాటు వంకను అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆక్రమించాడు. సదరు వ్యక్తికి 2.20 ఎకరాల పట్టా భూమి ఉంది. అయితే ఈ భూమికి ఆనుకుని ఓ వైపు వంక, మరో వైపు గుడిపాడు రంగస్వామి ఆలయానికి సంబంధించి మాన్యం భూమి ఉంది. గత కొద్ది రోజులుగా ఆ వ్యక్తి జేసీబీ ద్వారా వంక స్థలంతో పాటు మాన్యం భూమిని చదును చేసి హద్దులు ఏర్పాటు చేసుకున్నాడు. దాదాపు 50 సెంట్ల స్థలాన్ని ఆక్రమించినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ ఆక్రమణలపై విచారణ చేపట్టి వంకతో పాటు మాన్యం భూమిని ఆక్రమించిన వ్యక్తిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వంక ఆక్రమణ చేపట్టడం ద్వారా వర్షాలు వస్తే తమ పొలాలు ముంపుకు గురవుతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విషయాన్ని తహసీల్దార్ చంద్రశేఖర వర్మ దృష్టికి తీసుకెళ్లగా ఆక్రమణపై విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

క్రైం కార్నర్

మహిళ ఆత్మహత్య

డోన్ రూరల్ : పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన చంద్రావతి(32) అనారోగ్యంతో బుధవారం ఆత్మహత్యకు పాల్పడిందని పట్టణ ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. చంద్రావతికి ఆరు నెలలుగా మతిస్థిమితం సరిగాలేక అనారోగ్యంతో బాధపడుతూ ఉండేదన్నారు. బుధవారం ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుందన్నారు. మృత దేహాన్ని డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం ఆమె బంధువులకు అప్పగించామన్నారు. మృతురాలుకి ఇద్దరు కూతురులు, భర్త వెంకటేశ్వర్లు ఉన్నారన్నారు. ఆమె అన్న రామాంజినేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

వ్యక్తి అదృశ్యం

బేతంచెర్ల: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ సమీపాన నివాసం ఉండే మంగలి దినేష్ గత నెల 22న బయటకు వెళ్లి తిరిగి రాలేదని భార్య ప్రసన్న బుధవారం పోలీసులను ఆశ్రయించింది. హెడ్ కానిస్టేబుల్ బాలజీసింగ్ వివరాల మేరకు మంగళి దినేష్‌కు 2017లో ఓర్వకల్లుకు చెందిన ప్రసన్నతో వివాహం జరిగింది. దినేష్ హెయిర్ సెలూన్ నిర్వహిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. గత నెల 22న ఇంటి నుంచి షాపునకు వెళ్లాడు. రాత్రి సెల్‌ఫోన్ షాపులో ఉంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఇంటికి రాకపోవడంతో గాలించినా కన్పించలేదు. అయితే ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన జయలక్ష్మి అనే మహిళతో దినేష్‌కు పరిచయం ఉంది. ఆ మహిళతో కలిసి వెళ్లి ఉండవచ్చిని దినేష్ భార్య ప్రసన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

బేతంచెర్ల: పట్టణంలోని అయ్యల చెర్వులో నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు ఎస్‌ఐ శివ శంకర్ నాయక్ బుధవారం తెలిపారు. ఆలా మనోహర్ అనే వ్యక్తి నుంచి 69 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు.

నాటుసారా విక్రేత అరెస్టు

బేతంచెర్ల: మండల పరిధిలోని ముద్దవరం గ్రామ సమీపాన నాటుసారా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు సీఐ ప్రియతం రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన అంబాపురం మద్దయ్య నుంచి 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బ్లేడ్‌తో దాడి

డోన్ రూరల్ : మండల పరిధిలోని చిన్నమల్కాపురం గ్రామానికి చెందిన తలారి శివపై అదేగ్రామానికి చెందిన నరసింహులు బుధవారం రాత్రి బ్లేడ్‌తో దాడి చేసి గాయ పరిచాడు. శివ తండ్రి వాల్మీకి నాయుడు తెలిపిన వివరాల మేరకు...శివ తన ఇంటి వద్ద కూర్చుని ఉండగా నరసింహులు మద్యం మత్తులో వచ్చి గొంతుపై బ్లేడ్‌తో దాడి చేసి పారిపోయాడన్నారు. డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన డాక్టర్ కర్నూలుకు రెఫర్ చేశారన్నారు. వీరి ఇద్దరికీ సెల్ ఫోన్ విషయంలో కొద్దిరోజులుగా గొడవ జరుగుతుందని తెలిపారు.

బేతంచెర్ల పట్టణంలో చోరీ

బేతంచెర్ల: పట్టణంలోని ధరణి టౌన్ షిప్పులో ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన చోటు చేసుకుంది. ధరణి టౌన్ షిప్పులో తిమ్మరాజు, సిద్దాపురం జయలక్ష్మి దంపతులు నివాసం ఉన్నారు. ఈనెల 13న కల్లూరు మండలం తడకనపల్లె గ్రామంలో బంధువుల సీమంతం కార్యక్రమం ఉండటంతో ఇంటికి తాళం వేసి వెళ్లారు. 14న బేతంచెర్లకు వచ్చినా బేగరిపేటలో నివాసం ఉండే తల్లిదండ్రుల ఇంటికి వెళ్లారు. బుధవారం ఉదయం ఇంటికి వెళ్లి చూడగా తాళాలు పగిలి ఉన్నాయి. దుండగులు బీరువాలోని 8.50 తులాల బంగారం నగలను అపహరించుకు వెళ్లినట్లు గుర్తించారు. సీఐ ప్రియతం రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీమ్ ఫింగర్ ప్రింట్స్ సేకరించారు. బాధితురాలు సిద్దాపురం జయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రారంభమైన నంది విగ్రహ ప్రతిష్ఠ పూజలు

డోన్ టౌన్: మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో వెలసిన అతి ప్రాచీన పురాతన కాలం నాటి కోనేటి బావిలో నంది విగ్రహ పున ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు బుధవారం ప్రారంభం అయ్యాయి. నూతనంగా తయారు చేసిన నంది విగ్రహానికి వేద పండితులు, గ్రామ ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించి జల వాసం చేశారు. గతంలో ఈ బావిలో ఉన్న ఈశ్వరుని గుడిలో ఉన్న నంది విగ్రహాన్ని గుర్తు తెలియని దొంగలు గుప్త నిధుల కోసం అపహరించడంతో గ్రామానికి చెందిన కల్లూరు కుటుంబ సభ్యులు సొంత ఖర్చులతో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు చేపట్టారు.

సేవలు విస్తృతం చేస్తా

డోన్ టౌన్: స్ఫూర్తి సేవా సమితి వ్యవస్థాపకుడు సీసంగుంతల ఆలా మధుకు మనం ఫౌండేషన్ సంస్థ ఇంటర్నేషనల్ గ్లోరీ అవార్డును 2023 సంవత్సరానికి సంబంధించి అందజేసి సత్కరించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, జాతీయ అధ్యక్షుడు అయిన చక్రవర్తి చేతుల మీదుగా మధుకు అవార్డు ప్రదానం ఈనెల 13వ తేదీన కడపలో జరిగిన కార్యక్రమంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవార్డు బాధ్యతను పెంచిందని, సేవలను మరింత విస్తృతం చేస్తామన్నారు.

17న పట్టుబడిన వాహనాల వేలం

బనగానపల్లె : బనగానపల్లె సర్కిల్ పరిధిలో మద్యం కేసుల్లో సీజ్ చేయబడిన వాహనాలకు ఈ నెల 17న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు సీఐ సుబ్బరాయుడు బుధవారం తెలిపారు. వేలం పాటలో వాహనాలను దక్కించుకున్న వ్యక్తులు ఆ మొత్తంతోపాటు జీఎస్టీనీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. వేలంలో 16 ద్విచక్ర వాహనాలు, నాలుగు ఆటోలు, ఓ కారు వేలం వేయడం జరుగుతుందని వివరించారు.

ప్యాపిలి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్, సారా కేసులలో పట్టుబడిన ద్విచక్రవాహనాలను ఈ నెల 17 వ తేదీన వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ సీఎం రాకేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఉదయం ప్యాపిలి పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొత్తం 7 ద్విచక్ర వాహనాలను వేలం ద్వారా విక్రయించనున్నట్లు తెలిపారు. వేలం ద్వారా ద్విచక్రవాహనాన్ని దక్కించుకున్న వ్యక్తి ఆ మొత్తంతోపాటు అదనంగా జీఎస్టీ కూడా చెల్లించాల్సి ఉంటుందన్నారు.

16న డోన్‌లో...

డోన్ రూరల్ : స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో పట్టుబడిన వాహనాలకు ఈ నెల 16న వేలం పాట నిర్వహిస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ సురేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 ద్విచక్రవాహనాలను వేలం వేస్తున్నామని తెలిపారు.